ఆటోను ఢీకొన్న ఎన్నికల పరిశీలకుడి కారు 6

మహిళా కూలీ మృతి

నార్సింగ్ మండలం వల్లూరు వద్ద హైవేపై ఘటన



గిజిగాడి గూడు... నైపుణ్యం చూడు

గిజిగాడు కట్టే గూడు ఎంతో నేర్పరితనం ఉంటుంది. పిచ్చుకలు గూళ్లు అల్లడం, తమ పిల్లలకు ఆహారం నోటికి అందించడం, శత్రువులను ఎదుర్కోవడం.. పాములు, ఇతర శత్రువుల బారి నుంచి గుడ్లను, పిల్లలను కాపాడుకోవడానికి గూళ్లను ముళ్లచెట్లపైన, నీటికి దగ్గరగా కిందకు వేలాడేరీతిలో కట్టుకోవడం వీటి తెలివికి నిదర్శనం. సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం పర్శపల్లి గ్రామ సమీపంలోని ఊరు చెరువు ఆయకట్టు కింది భాగంలో ఓ తుమ్మచెట్టుకు వేలాడి ఉన్న పిచ్చుకులు, గూళ్లను 'ఆంధ్రజ్యోతి' కెమెరా క్లిక్‌మనిపించింది.

- కోహీర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి)

రెండో రోజు గ్లోబల్ సమ్మిట్‌లో నిర్మలాజగ్గారెడ్డి

సీఎం, మంత్రులతోపాటు డాక్యుమెంట్ ఆవిష్కరణలో పాల్గొన్న టీజీఐఐసీ చైర్‌పర్సన్

సంగారెడ్డి రూరల్ డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ రెండో రోజు సైతం పెట్టుబడుల వరద కొనసాగింది. సమ్మిట్ రెండో రోజైన మంగళవారం నాడు తెలంగాణ రాష్ట్రానికి వివిధ రంగాల్లో రూ. 1,11,395 కోట్లకుపైగా పెట్టుబడులు వచ్చాయి. మొత్తం రెండు రోజుల్లో కలిపి సుమారు రూ.3 లక్షల కోట్ల పెట్టుబడి ఒప్పందాలు (ఎంవోయూ) కుదిరాయి. రెండో రోజు రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్, అరబిందో ఫార్మా, హెటిరో, భారత్ బయోటెక్ లాంటి ప్రధాన సంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ రాష్ట్ర ప్రభుత్వం 2047 నాటికి తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చే లక్ష్యంతో రూపొందించిన తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పాల్గొన్నారు.



హైదరాబాద్‌లో నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్‌లో ఆసీనులైన టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి

పోలింగ్ రోజు సెలవు

- మెదక్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మూడు విడతలుగా జరిగే గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా.. ఆయా మండలాల్లో పోలింగ్ రోజు స్థానిక సెలవు ఇవ్వనున్నట్లు మెదక్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 11, 14, 17 తేదీల్లో ఎన్నికలు జరుగుతుండగా.. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఆయా మండలాల్లో స్థానికంగా సెలవులు ప్రకటించినట్లు ఆయన వెల్లడించారు.

మూడంచెల భద్రత

- సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్

సంగారెడ్డి క్రైం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా మొదటి విడత ఎన్నికలు జరగనున్న పంచాయతీల్లో ప్రశాంత వాతావరణంలో పోలింగ్ కొనసాగేలా మూడంచెల భద్రత ఏర్పాటు చేస్తున్నామని సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాల్లో నిఘా కట్టుదిట్టం చేశామని పేర్కొన్నారు. మద్యం, డబ్బు పంపిణీ చేసినా, ఎన్నికలకు భంగం కలిగించిన ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. సోషల్ మీడియాలో, ఇతర ప్రసార మాధ్యమాలలో కించపరిచేలా తప్పుడు ప్రచారాలు చేసినా చర్యలు తప్పవని తెలిపారు. పోలింగ్ కేంద్రం నుంచి నిర్దిష్ట దూరంలో ఉండాలని, కేంద్రం సమీపంలో ఇష్టానుసారంగా ప్రవర్తించినా, లౌడ్ స్పీకర్లు పెట్టినా, అరుపులు చేసినా చర్యలు తప్పవని పేర్కొన్నారు.

నిఘా నీడలో పోలింగ్

- మెదక్ ఎస్పీ శ్రీనివాసరావు

మెదక్ అర్బన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లాలో నిఘా నీడలో పోలింగ్ కొనసాగుతుందని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడానికి భద్రత చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రధానంగా సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా పెట్టడంతోపాటు అదనంగా బందోబస్తు కేటాయిస్తున్నామన్నారు. సమస్యాత్మక కేంద్రాల వద్ద ఏడుగురు సిబ్బందితోపాటు పర్యవేక్షణకు ఎస్‌ఐ, ప్రతీ మండలానికి సీఐ, రెండు మండలాకు ఒక డీఎస్పీని ఏర్పాటు చేశామని తెలిపారు. ఎస్‌ఐతోపాటు ఐదుగురు సిబ్బందితో స్ట్రైకింగ్ ఫోర్స్ పనిచేస్తుందని, 21 ఎస్‌ఎస్‌టీ బృందాలు, ఒక ఎఫ్‌ఎస్‌టీ బృందాన్ని నియమించామని తెలిపారు. ఎస్‌ఎస్‌టీ, ఎఫ్‌ఎస్‌టీ బృందాలతో అక్రమ మద్యం, నగదు రవాణా, ఓటర్లకు మద్యం పంపిణీ వంటి వాటని అడ్డుకోవడంతోపాటు ఓటర్లను ప్రలోభపెట్టకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు.





పల్లెల్లో డబ్బు, మద్యం పంపకాలు జోరుగా సాగుతున్నాయి. తొలివిడత పంచాయతీ ఎన్నికలు జరిగే గ్రామాల్లో మంగళవారం సాయంత్రం 5 గంటలతో ప్రచారానికి తెరపడింది. గురువారం పోలింగ్ నిర్వహించనున్నారు. దీంతో సర్పంచ్, వార్డు అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా ప్రలోభాల పర్వం మొదలుపెట్టారు. ఇన్నాళ్లు చేసిన ప్రచారానికి దీటుగా పంపకాలు కొనసాగిస్తేనే గెలుపు అవకాశాలు ఉంటాయనే దిశగా అడుగులేస్తున్నారు.

ష్.. గప్‌చుప్..

తొలి విడత ప్రచారానికి తెర.. ప్రలోభాల ఎర

- పల్లెల్లో డబ్బుల పంపకం..ఆపై ప్రమాణాలు
- గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం పంపిణీ
- కుంకుమ భరణిలు, చీరలు, ఓటుకు రూ.500 నుంచి రూ.5 వేలు వరకు
- పలుచోట్ల ఇంటికే మటన్, చికెన్, కూల్‌డ్రింక్స్, బిర్యానీ ప్యాకెట్లు సరఫరా

సంగారెడ్డి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : తొలివిడత పంచాయతీ ఎన్నికలు జరగనున్న సంగారెడ్డి జిల్లా కంది, కొండాపూర్, సదాశివపేట, పటాన్‌చెరు, గుమ్మడిదల, సంగారెడ్డి, హత్నూర, మెదక్ జిల్లా అల్లాదుర్గం, రేగోడ్, టేక్మాల్, హవేళిఘన్‌పూర్, పాపన్నపేట, పెద్దశంకరంపేట మండలాల్లో మైకులు మూగబోయాయి. పల్లెల్లో నిశ్శబ్ద వాతావరణం నెలకొంది. ప్రచారం ముగియడంతో గుట్టుగా నగదు పంపిణీకి తెరదీశారు. అదేవిధంగా వెండి కుంకుమ భరణిలు, చీరలు, మద్యం పంపిణీ చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో మటన్, చికెన్, కూల్‌డ్రింక్‌లు సైతం అందజేస్తున్నారు.

మొదలైన పంపకాలు

- సంగారెడ్డి మండలం తాళ్లపల్లిలో ఒక్కో ఓటుకు రూ.1000 నుంచి రూ.2వేల నగదు, మద్యం, కొందరికి ఆన్‌లైన్‌లో డబ్బు పంపించినట్లు తెలిసింది. ఇస్మాయిల్‌ఖాన్ పేటలో రూ.500, మద్యం, పసల్‌వాది గ్రామంలో రూ.500 ఇచ్చారనే ప్రచారం జరుగుతోంది.
- కంది మండలంలోని చేర్యాలలో ఓటుకు రూ.3వేలు ఇస్తున్నట్లు సమాచారం. కంది, చర్లగూడెం, కవలంపేట, ఎద్దుమైలారం, ఇంద్రకరణ్, కలివేముల గ్రామాల్లో ఓటుకు రూ.1000తోపాటు ఒక క్వాటర్ సీసా, మహిళలు, పిల్లలకు కూల్‌డ్రింక్ అందినట్లు తెలిసింది. బేగంపేట, చిద్రుప్ప, బ్యాతోల్, మామిడిపల్లి, చిమ్నాపూర్‌లో ఓటుకు రూ.వెయ్యి, సహపంక్తి దావత్‌లు జరిగినట్లు తెలుస్తోంది.
- టేక్మాల్ మండలంలోని అన్ని గ్రామాల్లో మద్యం సరఫరా చేస్తున్నారు. ఓటుకు రూ.200 నుంచి రూ.500 దాకా ఇస్తున్నారు.
- పటాన్‌చెరు మండలం నందిగామలో ఓటుకు రూ.10వేలపైనే పలుకుతున్నట్లుగా తెలుస్తోంది. క్యాసారంలో ఓటుకు రూ.6 వేలు, భానూరులో రూ.2 వేలతోపాటు కావాల్సినంత మద్యాన్ని పంపిణీ చేశారనే సమాచారం ఉంది.



అక్కడ ఫుల్ జోష్

సంగారెడ్డి జిల్లాలోని పటాన్‌చెరు మండలం భానూరు, క్యాసారం, నందిగామ గ్రామాల్లో ఓటర్లకు డిమాండ్ ఉంది. దీంతో బరిలో నిలిచిన అభ్యర్థులు ప్రతీ ఇంట్లో ఇప్పటి వరకు ఒక్కో ఫుల్‌బాటిల్ అందజేసినట్లుగా తెలుస్తోంది. సర్పంచ్, వార్డు అభ్యర్థులు సైతం ఇదే ఫార్ములా అనుసరిస్తున్నారు. కంది, సంగారెడ్డి

మిగతా 8వ పేజీలో

మూడో విడత ఇక ప్రచారం పర్వంలోకి..

నామినేషన్ల ప్రక్రియ సమాప్తం

జోరుగా ఏకగ్రీవాలు...తేలిన అభ్యర్థుల లెక్క



నర్సాపూర్ మండలంలో నామినేషన్ కేంద్రం వద్ద కోలాహలం

నారాయణఖేడ్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : తొలివిడత గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రచారం ముగియగా, మూడో విడత ఎన్నికలు నేటి నుంచి ప్రచారం పర్వంలోకి అడుగుపెట్టనుంది. ఇప్పటికే రెండో విడత ప్రచారం జోరుగా సాగుతోన్నది. మంగళవారం మూడో విడతలో ఉపసంహరణ ప్రక్రియ ముగిసింది. అనంతరం ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ఆయా పంచాయతీల్లో పోటీలో నిలిచిన అభ్యర్థులను ప్రకటించి, వారికి గుర్తులను కేటాయించారు. సంగారెడ్డి జిల్లాలో మూడో విడత ఎన్నికలు జరుగనున్న నారాయణఖేడ్ డివిజన్‌లోని 196 గ్రామ పంచాయతీలకు ఉపసంహరణ అనంతరం 24 సర్పంచు స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. 172 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరుగనుండగా 483 మంది పోటీలో ఉన్నారు. డివిజన్‌లో మొత్తం 196 సర్పంచు పదవులకు 1,153 మంది నామినేషన్లు వేసినప్పటికీ, 670 మంది నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. మెదక్ జిల్లాలో మూడో విడత ఎన్నికలు జరగనున్న నర్సాపూర్, శివ్వంపేట, కొల్చారం, కౌడిపల్లి, చిలప్‌చెడ్, వెల్దుర్తి మండలాల్లోని 183 పంచాయతీలకు ఉపసంహరణ అనంతరం 21 సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవమయ్యాయి.

సంగారెడ్డి జిల్లాలో మూడో విడత ఎన్నికల వివరాలు

మండలం	జీపీలు	ఏకగ్రీవం	పోటీలో అభ్యర్థులు
నారాయణఖేడ్	47	7	126
కంగ్టి	33	2	77
కల్హేర్	15	1	49
మనూరు	22	0	61
నాగల్‌గిద్ద	33	4	78
నిజాంపేట	18	3	40
సిర్గాపూర్	28	7	52



ఆసుపత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

11 మంది వైద్యులకు షోకాజ్ నోటీసులు

జోగిపేట రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జోగిపేటలోని ప్రభుత్వ ఆసుపత్రిని మంగళవారం కలెక్టర్ ప్రావీణ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి పాలనాధికారి, పలువురు వైద్యులు విధులకు హాజరు కాకపోవడాన్ని గుర్తించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన 11 మంది వైద్యులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని డీసీహెచ్‌ఎస్‌ను ఆమె ఆదేశించారు. అనంతరం కలెక్టర్ జడ్పీ బాలికల స్కూల్‌ను సందర్శించారు. పాఠశాలలో ఫెషియల్ రికగ్నిజేషన్ సిస్టం (ఎఫ్‌ఆర్‌ఎస్)ను సక్రమంగా అమలు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.

పోలింగ్ నిర్వహణలో అధికారుల పాత్ర కీలకం

జోగిపేట రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పోలింగ్‌ను ప్రశాంతంగా నిర్వహించడంలో అధికారుల పాత్ర కీలకమని సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. జోగిపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిసైడింగ్ అధికారులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులకు రెండవ దశ పంచాయతి ఎన్నికల ప్రక్రియల్లో భాగంగా కలెక్టర్ హాజరై పలు సూచనలు చేశారు. పోలింగ్ ప్రక్రియల్లో అధికారులు క్రియాశీలకంగా వ్యవహరించాలని సూచించారు. చెక్ లిస్టుకు అనుగుణంగా బ్యాలెట్ పత్రాలు, ఇతర సామగ్రిని ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలని తెలిపారు. పోలింగ్, కౌంటింగ్ సాఫీగా పూర్తయ్యేలా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో పాండు, ప్రిసైడింగ్ అధికారులు, మాస్టర్ ట్రైనర్‌లు, తదితరులు పాల్గొన్నారు.



విగ్రహాన్ని ఆవిష్కరించి పూలు చల్లుతున్న డీఆర్వో భుజంగరావు

తెలంగాణ స్ఫూర్తి తరతరాలకు వికసించాలి

- మెదక్ డీఆర్వో భుజంగరావు
- కలెక్టరేట్‌లో తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ

మెదక్ అర్బన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ స్ఫూర్తి తరతరాలపాటు వికసించాలని డీఆర్వో భుజంగరావు పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని డీఆర్వో భుజంగరావు, జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ ప్రజల్లో ఐక్యత, ఆత్మగౌరవాన్ని పెంపొందించే ప్రతీకగా తెలంగాణ తల్లి నిలుస్తుందన్నారు. తెలంగాణ అమరవీరుల త్యాగాలను కొనియాడుతూ.. తెలంగాణ తల్లి గొప్పదనాన్ని వివరించారు. అంతకుముందు జయ జయహే తెలంగాణ గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్‌బీ ఈఈ వేణు, డీఈ టెక్నికల్ కరుణ, డీఆర్డీవో పీడీ శ్రీనివాసరావు, ఏవో యూనస్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



రుద్రారంఘంలో చలిమంట వేసుకున్న యువకులు

ఇగం.. ఆగమాగం

ఉమ్మడి జిల్లాలో గణనీయంగా పడిపోయిన ఉష్ణోగ్రతలు.. 65 ప్రాంతాల్లో సింగిల్ డిజిట్ నమోదు

- ఝరాసంగంలో కనిష్ఠంగా 6.4 డిగ్రీలు
- సీజన్‌లోనే అత్యల్పంగా రికార్డు

కోహీర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మెదక్ జిల్లా గజగజ వణుకుతోంది. ఇగం(చల్లని గాలి) వస్తుండడంతో పిల్లలు, వృద్ధులు, ఉదయం వేళ పనులకు వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో ఉష్ణోగ్రతలు సోమవారమే రికార్డు స్థాయిలో కనిష్ఠానికి పడిపోగా, మంగళవారం అంతకుమించి అత్యల్పంగా నమోదై ఈ చలికాలంలోనే అతితక్కువగా రికార్డుయింది. సోమవారం సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో 6.6 డిగ్రీలు నమోదు కాగా, మంగళవారం ఉదయం ఝరాసంగంలో 6.4 డిగ్రీలుగా రికార్డు అయ్యింది. ఇది రాష్ట్రంలోనే రెండో అత్యల్ప ఉష్ణోగ్రత. ఉమ్మడి మెదక్ జిల్లాలోని 65 ప్రాంతాల్లో సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ ప్రాంతాలు ఆరంజ్ అలర్ట్‌లోకి చేరాయి. మరో నాలుగు రోజులపాటు అత్యల్ప ఉష్ణోగ్రతలే నమోదు అవుతాయని, చలి తీవ్రత ఇంకా పెరిగే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు పేర్కొంటున్నారు.

ఉమ్మడి మెదక్ జిల్లాలో నమోదైన ఉష్ణోగ్రతలు

సంగారెడ్డి జిల్లాలో.. ఝరాసంఘం 6.4, జహీరాబాద్ 6.6, సత్వార్ 6.7, అల్గోల్ 6.8, కోహీర్ 6.8, న్యాల్‌కల్ 7.1, మొగడంపల్లి 7.2, మల్‌చెల్మ 7.9, కడ్పల్ 8.0, నల్లవల్లి 8.5, పుల్కల్ 8.5, నిజాంపేట్ 8.5, సదాశివపేట 8.7, పాశమైలారం 8.7, సిర్గాపూర్ 8.9, కంగ్టి 9.1, దిగ్వాల్ 9.3, జిన్నారం 9.4, కొండాపూర్ 9.4, రామచంద్రపురం 9.4, గుండ్లమాచనూరు 9.4, రాయికోడు 9.5, నాగల్‌గిద్ద 9.5, హత్నూర 9.6, కంది 9.7, ముక్తాపూర్ 9.9, చౌటాకుర్ 9.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

మెదక్ జిల్లాలో... వెల్దుర్తి 8.1, శివ్వంపేట్ 8.2, దామరంచ 8.4, వాడి 8.6, సర్దన 8.6, కుల్చారం 8.7, బుజ్జారంపేట 8.8, నార్సాపూర్ 8.9, నాగపూర్ 8.9, కాగజ్‌మద్దూర్ 9.0, మినీపూర్ 9.3, బోడగట్ 9.3, చిప్పల్‌తుర్తి 9.5, దొంగలదర్మారం 9.5, కొత్తపేట 9.5, మాసాయిపేట్ 9.6, లింగాయపల్లి 9.6, శంకరంపేట(ఏ) 9.7, రాజ్‌పల్లి 9.7, శివనూర్ 9.8, నర్సాపూర్ 9.8 డిగ్రీలుగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

కార్మికులను బానిసలుగా మార్చే కుట్ర 7

సీఐటీయూ రాష్ట్ర మహాసభల్లో ఎం. సాయిబాబా

నగదు పట్టివేత



నగదును పట్టుకున్న అధికారులు

మునిపల్లి, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి) : సర్పంచ్ ఎన్నికల సందర్భంగా వాహనాల తనిఖీల్లో భాగంగా రూ. లక్ష నగదును పట్టుకున్నారు. పత్రాలు లేకుండా పైసలు తీసుకెళ్తే వాటిని సీజ్ చేస్తామని మునిపల్లి ఎస్సై రాజేష్ నాయక్, ఫ్లైయింగ్ స్క్వాడ్ (ఎఫ్ఎస్‌టీ) ప్రదీప్‌లు హెచ్చరించారు. సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం మండలంలోని బుదేరా చౌరస్తాలో వాహనాల తనిఖీ చేస్తున్న క్రమంలో మండలంలోని పెద్దలోడి గ్రామానికి చెందిన పెద్దగొల్ల దస్సయ్య అనే వ్యక్తి కారును తనిఖీ చేశారు. అందులో ఎలాంటి పత్రాలు లేకుండా (రూ.500నోట్లు యాభై వేలు రెండు కట్టలు) రూ.లక్ష నగదును అధికారులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్‌ఉన్నందున నగదు తీసుకెళ్తే వాటికి సంబంధించిన పత్రాలు తప్పని సరిగా వెంట పెట్టుకోవాలని సూచించారు. పత్రాలు లేకుండాతీసుకెళ్తే వాటిని సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ తనిఖీలో ఆర్‌ఐ సుభాష్, ఎమ్మార్వో కార్యాలయ అసిస్టెంట్ శశాంక్ తదితరులు ఉన్నారు.

దంపతుల మధ్య గొడవ.. భర్త అదృశ్యం



రవి (ఫైల్)

తూప్రాన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అప్పుల విషయంలో దంపతుల మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపంతో భర్త ఇంట్లోంచి వెళ్లిపోయాడు. ఈ సంఘటన తూప్రాన్ పట్టణంలో చోటు చేసుకుంది. తూప్రాన్ ఎస్సై శివానందం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మాసాయిపేట మండలం చెట్లతిమ్మాయిపల్లికి చెందిన బర్మావత్ సునీత, బర్మావత్ రవి (36) దంపతులు రెండేళ్లుగా తూప్రాన్ పట్టణంలోని వినాయకనగర్ కాలనీలో నివాసముంటున్నారు. భర్త రవి చేసిన అప్పుల విషయంలో గతనెల 20న రాత్రి దంపతుల మధ్య గొడవ జరిగింది. 21న ఉదయం 8 గంటలకు రవి పనికి వెళ్తున్నట్లు చెప్పి ఇంట్లోంచి వెళ్లాడు. రాత్రి వరకు ఇంటికి రాలేదని, రవికి ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వస్తుందని వివరించారు. రవి కోసం చుట్టు పక్కల బంధువుల వద్ద వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. మంగళవారం వరకు ఆచూకీ లభించకపోవడంతో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై శివానందం పేర్కొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లుదగ్ధం

జహీరాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని అల్గోల్ గ్రామంలో మంగళవారం షార్ట్ సర్క్యూట్‌తో వాకిలి లక్ష్మమ్మకు చెందిన ఇల్లుపూర్తిగా దగ్ధమైంది. స్థానికులు, బాదితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంట్లో ఏర్పాటుచేసిన ఫ్రిజ్‌పై క్యాండిల్ ముట్టించి ఉంచడంతో అక్కడ ఉన్న దుస్తులకు, వైరుకు తగులుకుని మంటలు తగలడంతో పెద్ద ఎత్తున మంటలు ఎగిశాయి, దీంతో రేకులతో ఉన్న ఇల్లు, ఇంట్లో గల బంగారం, నగదు, వంటసామగ్రి, తదితరాలు పూర్తిగ కాలిపోయాయన్నారు. సుమారు రూ.10లక్షలకు పైగానే నష్టం వాటిల్లిందని స్థానికులు వివరించారు. తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

కొమురవెల్లి, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లన్న ఆలయానికి సమీపంలో గత నెల 29వ తేదిన మహిళ మెడలోంచి పుస్తెల తాడును చోరి చేసిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు.ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఎస్సై టి.మహేష్ వివరాలను వెల్లడించారు. మండలకేంద్రానికి చెందిన మహిళ మెడలోంచి గత నెల 29వ తేదిన పుస్తెలతాడును అపహరించిన కేసులో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి తీగుళ్ల రజనీకాంత్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసి చోరీ చేసిన వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలిస్తామని పేర్కొన్నారు.

తహసీల్దారు ఎదుట పలువురి బైండోవర్

మద్దూరు , డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మద్దూరు మండలంలో సర్పంచ్ ఎన్నికల్ని పురస్కరించుకుని గతంలో కేసులున్న వారిని తహసీల్దారు ఎదుట బైండోవర్ చేస్తున్నట్లు ఎస్సై షేక్ మహబూబ్ అలీ తెలిపారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి గొడవలు సృష్టించకుండా ఉండేందుకు సుమారు 65 మందిని ఇప్పటి వరకు బైండోవర్ చేసినట్లు తెలిపారు. ప్రజలందరు ఎన్నికల నియమావళిని పాటించి ఎన్నికలు సజావుగా జరిగేలా సహకరించాలని సూచించినట్లు తెలిపారు.

భారీగా మద్యం పట్టివేత

ములుగు/తూప్రాన్/చేగుంట/టేక్మాల్/కోహెడ/రేగోడు,డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల సందర్భంగా ఎఫ్ఎస్‌టీ టీమ్ ముమ్మారంగా వాహనాలు తనిఖీ నిర్వహిస్తున్నారు. నాయకులు మద్యం అక్రమంగా తరలిస్తూ పట్టుబడుతున్నారు. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలో పలు చోట్ల భారీగా మద్యం పట్టుకున్నారు. మంగళవారం రేగోడు మండలంలోని మార్పల్లి గ్రామ రహదారులపై వాహనాల తనిఖీలు నిర్వహించగా బైక్‌పై తీసుకెళ్తున్న 73 మద్యం బాటిళ్లను పట్టుకున్నారని ఆర్‌ఐ విజయలక్ష్మి తెలిపారు. పట్టుకున్న మద్యాన్ని స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించామని తెలిపారు.

ములుగు : మండల కేంద్రమైన ములుగులో ఉదయం 4:30 నిమిషముల సమయంలో గ్రామ శివారులోని శ్యామ్‌సుందర్‌రెడ్డి వ్యవసాయ పొలం వద్ద గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి, ములుగు ఎస్సై రఘుపతి సిబ్బందితో కలిసి తనిఖీ చేయగా పలు రకాల మద్యం బాటిళ్లు లభించాయి. మొత్తం 673లీటర్ల(మద్యం విలువ 7,40,520) మద్యం బాటిళ్లు స్వాధీనం పరుచుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు.

తూప్రాన్ : తూప్రాన్ మండలంలో అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లు పట్టుకున్నట్లు ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ ఇన్‌చార్జి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రేమ్‌కుమార్ తెలిపారు. తనిఖీల్లో సుమారు రూ. 70వేల విలువైన 9 కాటన్ల మద్యం బాటిళ్లు పట్టుకున్నట్లు పేర్కొన్నారు. పట్టుబడిన మద్యం కాటన్లు పోలీసులకు అప్పగించి ఫిర్యాదు చేసినట్లు ప్రేమ్‌కుమార్ తెలిపారు.

చేగుంట : నార్సింగ్ శివారులోని నర్సంపల్లి, మిర్జాపల్లి రహదారుల్లో వాహనాలను తనిఖీ చేస్తుండగా నర్సంపల్లి ఆటోలో తరలిస్తున్న ఐబీ విస్కీ కాటన్, ఒక బీర్ కాటన్, మిర్జాపల్లి రహదారిలో కారులో తరలిస్తున్న రెండు ఐబి విస్కీ కాటన్‌లు, మూడు మ్యాక్‌డోల్ విస్కీ కాటన్‌లు పట్టుకొని పోలీసులకు అప్పగించినట్లు ఎఫ్ఎస్‌టీ అధికారులు శ్రీధర్ తెలిపారు.

టేక్మాల్ : టేక్మాల్ మండల కేంద్రంలో తొమ్మిది మంది వద్ద నుంచి 122 లీటర్ల మద్యం బాటిళ్లను పట్టుకున్నారు. వాటి విలువ 70వేలు ఖరీదు ఉంటుందని తరలించిన వాహనాలు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై అరవింద్ తెలిపారు. ఓటర్లకు ప్రలోభపెట్టడానికి కొందరు మద్యం పంపిణీ చేయడానికి ప్రయత్నిస్తున్నారన్న సమాచారం మేరకు ఈ దాడులు నిర్వహించామని తెలిపారు. ఈ క్రమంలో అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని సీజ్ చేసి వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అరవింద్ తెలిపారు.



తూప్రాన్‌లో పట్టుబడిన మద్యం బాటిళ్లు

మద్యం నిల్వచేసిన ఇద్దరిపై కేసు నమోదు

కోహెడ : కోహెడ మండలం వెంకటేశ్వరపల్లి గ్రామ పరిధిలోని షేర్‌హలీనగర్‌లో అక్రమంగా మద్యం నిల్వచేసిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి. అభిలాష్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. షేర్‌అలీనగర్ చెందిన షేక్ షరీఫ్, షేక్ అక్బర్ అనే ఇద్దరి ఇళ్లల్లో ఎన్నికల కోసం మద్యం నిలువ చేసినట్లు సమాచారం వచ్చిందన్నారు. ఈ మేరకు పోలీసులతో తనిఖీ చేశామన్నారు. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా మద్యం నిల్వ చేయడంతో వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. ఏ ఒక్కరు కూడా ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

ఆటోను ఢీకొన్న ఎన్నికల పరిశీలకుడి కారు

● ఆటో వెళ్లి మహిళను ఢీ.. మహిళా కూలీ మృతి

చేగుంట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల పరిశీలకుడి కారు వేగంగా వచ్చి ఆటోను ఢీ కొట్టగా.. ఆ ఆటో వెళ్లి రహదారిపై పనులు చేస్తున్న మహిళా కూలిని ఢీ కొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటన మెదక్ జిల్లా నార్సింగ్ మండలం వల్లూరు 44వ జాతీయ రహదారిపై మంగళవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. చేగుంట మండలం వడియారం గ్రామానికి చెందిన గూని సత్తెమ్మ (40) రోజు మాదిరిగానే మంగళవారం జాతీయ రహదారి (జీఎంఆర్ సంస్థ) కాంట్రాక్టర్ వద్ద రోడ్డు డివైడర్ పై పూల మొక్కలల్లో గడ్డి తొలగించేందుకు కూలి పనులకు వెళ్లింది. డివైడర్ వద్ద చెత్తను గడ్డి తొలగించే క్రమంలో హైదరాబాద్ నుంచి నిజామాబాద్ వైపు అతివేగంగా వెళ్తున్న నిర్మల్ జిల్లా గ్రామ పంచాయతీ ఎన్నికల సాధారణ అబ్జర్వర్ ప్రయాణిస్తున్న కారు ముందు వెళ్తున్న ఆటోను వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ క్రమంలో ఆటో రోడ్డు పక్కన పని చేస్తున్న గుని సత్తెమ్మను ఢీ కొట్టడంతో ఆమె కాలువలో పడి అక్కడికక్కడే మృతి చెందింది. ఆటోలో ఉన్న డ్రైవర్‌కు పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ఆసుపత్రికి తరలించారు. మృతురాలు సత్తెమ్మ కుమారుడు సురేష్ ఫిర్యాదు మేరకు నార్సింగ్ ఎస్ఐ సృజన కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కారు డ్రైవర్ పరారీలో ఉన్నాడు.



ప్రమాదానికి కారణమైన కారు



గుని సత్తెమ్మ (ఫైల్)

విధులకు ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు దూరం

● మూడు నెలల వేతన బకాయిలు పెండింగ్

● జీతాలిచ్చే వరకు నల్లబ్యాడ్జీలతో నిరసన

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని జాతీయ ఆరోగ్య మిషన్(ఎన్‌హెచ్‌ఎం)పథకం కింద పనిచేస్తున్న వైద్య ఉద్యోగులు, సిబ్బంది ఈ నెల 11 వ తేదీ నుంచి అన్ని రకాల సేవలు నిలిపివేయడంతో పాటు విధులకు దూరంగా ఉండనున్నట్లు ప్రకటించారు. సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు ఇలా మూడు నెలల వేతన బకాయిలు ప్రభుత్వం ఇప్పటి వరకు చెల్లించకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఉద్యోగులు తెలిపారు. వేతనాలు విడుదల చేసే వరకు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలపనున్నట్లు పేర్కొన్నారు. ఇదే విషయమై మంగళవారం ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఎప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో సంగారెడ్డి డీఎంహెచ్‌వో డా.వసంతరావుకు వినతి పత్రం సమర్పించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని, అదే విధంగా ప్రతి నెలా సమయానికి వేతనాలు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు కోరారు.



సంగారెడ్డిలో పోస్టాఫీస్ కార్యాలయంలో ఉత్తరాలు చూపుతున్న ప్రజా సంఘాల నాయకులు

ఈవీఎం టాంపరింగ్‌పై దేశవ్యాప్త ఉద్యమం

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఈవీఎం టాంపరింగ్‌పై దేశవ్యాప్త ఉద్యమం చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలని నేటివ్ ఇండియా ఫోరం జాతీయ అధ్యక్షుడు బీరయ్య యాదవ్ పిలుపునిచ్చారు. సంగారెడ్డిలో పోస్టాఫీస్ కార్యాలయంలో మంగళవారం ప్రజా సంఘాల నాయకులు సుప్రీం కోర్టు న్యాయమూర్తికి ఉత్తరాలు రాసి స్పీడ్ పోస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీహార్ ఎన్నికల ఫలితాలు పలు అనుమానాలకు తావిస్తున్న నేపథ్యంలో ఈవీఎంలను ఫోరెన్సిక్ పరీక్ష చేసి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పాత బ్యాలెట్ పద్ధతిలో పరీక్షలు నిర్వహించాలన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

కల్హేర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండల పరిధిలోని బాచేపల్లి గ్రామంలో తాళం వేసిన ఇంట్లోకి చొరబడిన దొంగలు చోరీ చేసినట్లు కల్హేర్ ఎస్సై రవిగౌడ్ మంగళవారం తెలిపారు. గ్రామానికి చెందిన నోముల సునీత అనే మహిళ తన తల్లి గారి గ్రామమైన కల్హేర్ మండలంలోని మాసాన్‌పల్లి గ్రామానికి జాతర ఉత్సవాలకు వెళ్లగా సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగుల గొట్టి ఇంట్లోకి చొరబడి బీరువా ధ్వంసం చేసి అందులోని తులం బంగారు వస్తువులు, 24 తులాల వెండి నగలు దొంగిలించిన్లు ఆయన తెలిపారు. సునీత ఇంటి ముందు వీరశెట్టి అనే వ్యక్తి తన బైకు నిలుపగా బైకును కూడా చోరీ చేసినట్లు ఎస్సై తెలిపారు. గ్రామ శివారులోని పట్లోళ్ల వెంకట్‌రెడ్డి సిమెంటు దుకాణం షటర్ ధ్వంసం చేసి అందులో ఉన్న నగదు కూడా దొంగిలించారు. బాధితురాలు సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుచునంటట్లు ఎస్సై రవిగౌడ్ తెలిపారు.



నిజాంపేట మండల బాచేపల్లిలో చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న ఎస్సై

కార్మికులను బానిసలుగా మార్చే కుట్ర

- మతోన్మాదంతో వారిని విడదీయాలని చూస్తున్నారు
- సీఐటీయూ రాష్ట్ర మహాసభల్లో ఎం. సాయిబాబా
- రాష్ట్ర కార్యవర్గం ఎంపిక



వేదికపై ప్రసంగిస్తున్న సీఐటీయూ అఖిల భారత కమిటీ కోశాధికారి ఎం. సాయిబాబా

మెదక్ కల్చరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కార్మిక సంఘాలను బలహీన పరిచి, పెట్టుబడిదారులకు, కార్పొరేట్ యాజమాన్యాలకు లాభాలు చేకూర్చేవిధంగా వ్యవహరిస్తోందని సీఐటీయూ అఖిల భారత కమిటీ కోశాధికారి ఎం. సాయిబాబా ఆరోపించారు. నాలుగు లేబర్ కోడ్లను అమలు చేసేందుకు నిర్ణయించి, కార్మికులను మధ్య యుగాల నాటి బానిసలుగా మార్చేందుకు కుట్ర చేస్తున్నదని మండిపడ్డారు. సీఐటీయూ రాష్ట్ర ఐదో మహాసభలు మెదక్ పట్టణంలో మూడు రోజులుగా జరుగుతున్నాయి. మంగళవారం జరిగిన ముగింపు సభలో ఎం. సాయిబాబా మాట్లాడారు. కార్పొరేట్ మతోన్మాద ప్రభుత్వం రాజ్యాంగ హక్కులు, ప్రజాస్వామిక విలువలను ఉల్లంఘిస్తూ శ్రమశక్తి నీతి -2025 పేరుతో కొత్త కార్మిక విధానాన్ని తీసుకురాబోతున్నదని తెలిపారు. బహిరంగంగా మనుధర్మ శాస్త్రమని ప్రకటించటం ఆందోళనకరమన్నారు. రాజ్యాంగం కల్పించిన సమానత సూత్రాలకు తిలోదకాలిస్తూ రాజధర్మ, మనుధర్మం పేరుతో కుల, మత విభజనలతో కార్మిక వర్గ పోరాటాలను బలహీన పర్చే ఆర్ఎస్ఎస్, బీజేపీ కుట్రలను కార్మిక వర్గం ఆమోదించబోదని, తీవ్ర ప్రతిఘటనను అడ్డుకుంటున్నారు. ఈ చట్టాల వల్ల జరగబోయే ప్రమాదాలను తెలియజేస్తూ ఫిబ్రవరిలో ప్రత్యక్ష పోరాటానికి కార్మిక వర్గాన్ని సన్నద్ధం చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే అన్ని కార్మిక సంఘాల ఐక్య జాతీయ వేదిక ఢిల్లీలో సమావేశమై కార్యాచరణ రూపొందించనున్నట్టు తెలిపారు. రాజ్యాంగం ఉమ్మడి జాబితాలో ఉన్న కార్మిక చట్టాల రూపకల్పనను రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చించకుండా అమలుకు పూనుకోవటం తీవ్ర అనర్థాలకు దారి తీస్తుందని, వీటిని అమలు చేయబోమని ప్రకటించిన కేరళ ప్రభుత్వాన్ని అభినందించారు. ఇదే దారిలో తెలంగాణ రేవంత్ రెడ్డి ప్రభుత్వం చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ అఖిల భారత అధ్యక్షురాలు డాక్టర్ హేమలత మాట్లాడుతూ పాలక వర్గాలు కార్మికవర్గానికి నష్టం చేసే చర్యలు తీసుకుంటున్నాయని, వీటికి వ్యతిరేకంగా పోరాటాలను మరింత ఉధృతిని పెంచాలని సూచించారు.

శ్రమశక్తి నీతిని ఉపసంహరించాలి

ఈ సభల్లో పలు తీర్మానాలను రాష్ట్ర కార్యదర్శి వీఎస్ రావు, ముత్యంరావు ఆధ్వర్యంలో ప్రవేశపెట్టారు. ఇందులో పాలకులు శ్రమశక్తి నీతి - 2025 ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఆ పేరుతో మోదీ ప్రభుత్వం కార్మిక ముసాయిదాను ప్రకటించిందని తెలిపారు. కార్మిక చట్టాల అమలు, తనిఖీలు, యాజమాన్యాలకు, కార్మిక సంఘాలకు మధ్య మధ్యవర్తిత్వం వహించటం ద్వారా రాజీలు కుదర్చటం, తీర్పులివ్వటం వంటి పద్ధతులతో వివాదాలు పరిష్కరించే బాధ్యత కార్మిక శాఖదని తెలిపారు. కానీ, ఇప్పుడు ఆ శాఖను యాజమాన్యపు శాఖగా మార్చనుందని పేర్కొన్నారు. మొత్తం 39 తీర్మానాలను ఆమోదించించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక....

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా చుక్క రాములు, పాలడుగు భాస్కర్, కోశాధికారిగా వంగూరు రాములు తిరిగి ఎన్నికయ్యారు. 31 మందితో ఆఫీసు బేరర్లను ఎన్నుకొన్నారు. ఇందులో ఉపాధ్యక్షులుగా ఎస్ వీరయ్య, ఆర్. సుధాభాస్కర్, భూపాల్, ఎస్వీ రమ, కళ్యాణం వెంకటేశ్వర రావు, టి. వీరారెడ్డి, పి జయలక్ష్మి, జె మల్లికార్జున్, వీఎస్ రావు, కె ఈశ్వరరావు, టి. రాజారెడ్డి, ఆర్ త్రివేణి, కార్యదర్శులుగా జె. వెంకటేష్, ఏ. ముత్యంరావు, బి. మధు, జె. చంద్రశేఖర్, బి. మల్లేశ్, ఎం. పద్మశ్రీ, కూరపాటి రమేష్, పి. శ్రీకాంత్, ఎం. వెంకటేశ్, ఏజే. రమేష్, రాగుల రమేష్, కె. గోపాలస్వామి, కాను మాధవి, పి. సుధాకర్, జి. కవితలతో పాటు 109 మంది రాష్ట్ర కౌన్సిల్, 103 వర్కింగ్ కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

ఒకే కుటుంబం.. మూడు దశాబ్దాలుగా బరిలో..


చుక్క కిషన్ భార్య, కొడుకు, కోడలు

- కిష్టాపూర్‌లో ఆరోసారి బరిలో నిలిచిన చుక్క కిషన్ కుటుంబం


చుక్క కిషన్

తూప్రాన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఏర్పడిన నాలుగున్నర దశాబ్దాల కాలంలో ఏడు పర్యాయాలు ఎన్నికలు జరిగాయి. ఇందులో 1995 నుంచి ఒకే కుటుంబం ఐదు పర్యాయాలు పోటీ చేయగా, ఆరో పర్యాయం మళ్లీ పోటీకి నిలిచింది. ఇందులో రెండు పర్యాయాలు సర్పంచ్‌గా గెలుపొందారు. ఈ విచిత్ర పరిస్థితి మెదక్ జిల్లా తూప్రాన్ మండలం కిష్టాపూర్ గ్రామ పంచాయతీలో చోటు చేసుకుంది. కిష్టాపూర్ గ్రామం గ్రామ పంచాయతీగా 1979లో ఏర్పడింది. అప్పటి నుంచి 1988 వరకు వంజరి కిష్టయ్య సర్పంచ్‌గా పనిచేయగా, 1988 జరిగిన ఎన్నికల్లో మాచిరెడ్డి కిష్టారెడ్డి గెలుపొందాడు. అనంతరం 1995లో జరిగిన ఎన్నికల్లో చుక్క కిషన్ పోటీ చేసి విజయం సాధించారు. 2000లో జరిగిన ఎన్నికల్లో చుక్క కిషన్ తన భార్య చంద్రకళను పోటీలో నిలపగా ఓటమి చెందారు. 2007లో జరిగిన ఎన్నికల్లో చుక్క కిషన్ మళ్లీ సర్పంచ్‌గా గెలుపొందారు. అయితే 2011లో ఆయన అనారోగ్యంతో మృతిచెందారు. 2012 జరిగిన ఎన్నికల్లో చుక్క కిషన్ కోడలు చుక్క హిమబిందు పోటీ చేసి ఓటమి చెందారు. 2018 లో జరిగిన ఎన్నికల్లో చుక్క కిషన్ కొడుకు పోటీ చేసి ఓటమి చెందాడు. మళ్లీ రిజర్వేషన్ అనుకూలించడంతో, ప్రస్తుతం జరుగుతున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో చుక్క కిషన్ కోడలు హిమబిందు (చుక్క శ్రీశైలం భార్య) మరోసారి పోటీ చేస్తున్నారు.



ఎమ్మెల్యే స్వగ్రామంలో ఏడుగురు అభ్యర్థులు

- ఆసక్తికరంగా మారిన బోరంచ రాజకీయం

మనూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి స్వగ్రామమైన మనూరు మండలం బోరంచలో ఏడుగురు అభ్యర్థులు సర్పంచ్ బరిలో ఉండటంతో రాజకీయం ఆసక్తికరంగా మారింది. సర్పంచ్ కోసం 16 మంది నామినేషన్లు దాఖలు చేశారు. కొంతమంది ఉపసంహరించుకోగా, ఏడుగురు అభ్యర్థులు పోటీలో నిలిచారు. గత ఎన్నికల్లో ఈ గ్రామం నుంచి సర్పంచ్ పదవి కోసం ముగ్గురు అభ్యర్థులు మాత్రమే పోటీలో ఉండగా, బీఆర్ఎస్ మద్దతుదారుడు సర్పంచ్‌గా గెలుపొందారు. గత ఎన్నికల్లో ఈ పంచాయతీ బీసీ రిజర్వేషన్ కాగా, ఈ సంవత్సరం మాత్రం జరిగే పంచాయతీ ఎన్నికల్లో జనరల్ రిజర్వు కావడంతో పోటీ చేయడానికి అందరూ ఆసక్తి చూపుతున్నారు. ఈసారి ఏడుగురు అభ్యర్థులు పోటీలో ఉండగా, బీఆర్ఎస్ మద్దతుతో ఇద్దరు, కాంగ్రెస్ మద్దతుతో ఇద్దరు, మరో ముగ్గురు స్వతంత్ర అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. బోరంచలో 2124 ఓట్లు ఉండగా, ఈ నెల 17ననననననన పోలింగ్ జరుగనున్నది.

గతంలో కళకళ .. నేడు కనుమరుగు

- మాయమైన గుడాటిపల్లి


గుడాటిపల్లి గ్రామ పంచాయతీ

హుస్నాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గత పంచాయతీ ఎన్నికల్లో కళకళలాడిన పల్లె నేడు కనిపించకుండా పోయింది. ఆ పల్లె పేరు కూడా మాయమైంది. అదే అక్కన్నపేట మండలంలోని గుడాటిపల్లి. గౌరవెల్లి రిజర్వాయర్ ముంపు గ్రామం అయిన గుడాటిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో తెనుగుపల్లి, చౌళ్లపల్లి, మద్దెలపల్లి, కొత్తపల్లి, సోమాజితండా, బొంద్యానాయక్ తండా, సేవానాయక్ తండా, జాలుబాయి తండా, చింతల తండాలుండగా దాదాపు 2400 మంది ఓటర్లు ఉండేవారు. గౌరవెల్లి రిజర్వాయర్‌లో నీటిని నింపేందుకు 2023 మే 10వ తేదీన గుడాటిపల్లి ప్రజలను ఖాళీ చేయించారు. ప్రస్తుతం ఈ పల్లె వాసులు సవాలాల్ మహరాజ్ తండా, హుస్నాబాద్, పోతారం (ఎస్), గౌరవెల్లి, కూచనపల్లి క్రాసింగ్, చిగురుమామిడి మండలం కూచనపల్లి, రేగొండ గ్రామాల్లో ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నారు. ఈ పంచాయతీ ఎన్నికల సమయంలో చెట్టుకొకరు పుట్టకొకరమై మా గుడాటిపల్లి పల్లె పేరు లేకుండా పోయిందని ఆ పల్లె ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఊరు చిన్నది... పోరు పెద్దది

- నాగాపూర్‌లో 880 ఓట్లు.. ఏడుగురు సర్పంచ్ అభ్యర్థులు

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి మండలంలోనే ఆ గ్రామం చిన్నది. కానీ సర్పంచ్ పదవికి మాత్రం భారీగా పోటీ నెలకొంది. మేజర్ గ్రామ పంచాయతీలలో సైతం ముగ్గురు నుంచి నలుగురు అభ్యర్థులు పోటీలో ఉంటేనే ఎక్కువ అనుకుంటారు. కానీ మండల పరిధిలోని నాగాపూర్ గ్రామ పంచాయతీలో కేవలం 1200 జనాభా, 880 ఓటర్లు మాత్రమే ఉన్నా సర్పంచ్ పదవికి ఏడుగురు అభ్యర్థులు బరిలో నిలిచారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో జనరల్ రిజర్వేషన్ రావడంతో ఆశావహులు పెరిగిపోయారు. సర్పంచ్ అభ్యర్థులుగా తాజా మాజీ సర్పంచ్ కటకం రాజు, మాజీ సర్పంచ్ అశోక్ గౌడ్, నాగరాజు గౌడ్, హన్మంతు, గొల్ల దశరథ్, చింతల బాలరాజు, విజయేందర్‌రెడ్డి మొత్తం ఏడుగురు పోటీలో నిలిచారు. ఓటర్లు ఎవరికి పట్టం కడతారో తెలియాలంటే డిసెంబరు 11వ తేదీ వరకు వేచి చూడాల్సిందే.

మళ్లీ పాత ప్రత్యర్థులే...

కల్హేర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రాపర్తి గ్రామ పంచాయతీలో 2019 గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ పదవికి పోటీ చేసిన వ్యక్తులే మరోసారి బరిలోకి దిగుతుండటం విశేషం. బీఆర్ఎస్ పార్టీ మద్దతుతో మంద శ్రవణ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మద్దతుతో ఎర్ర రవి 2019లో పోటీ చేయగా, 273 ఓట్ల మెజారిటీతో మంద శ్రవణ్‌కుమార్ విజయం సాధించారు. తిరిగి ఈ ఇద్దరూ అవే పార్టీల మద్దతుతో బరిలోకి దిగుతున్నారు. మంగళవారం నామినేషన్ల ఉపసంహరణ అనంతరం వీరితో కలిపి రాపర్తి పంచాయతీలో ఐదుగురు అభ్యర్థులు పోటీలో మిగిలారు.

మూడు సార్లు సర్పంచ్.. ప్రస్తుతం వార్డు సభ్యుడిగా పోటీ

హుస్నాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : అక్కన్నపేట మండలానికి చెందిన ఓ గ్రామంలో మూడు మార్లు సర్పంచ్‌గా గెలుపొందిన వ్యక్తి ప్రస్తుతం వార్డు సభ్యునిగా పోటీ చేస్తున్నారు. 2001 నుంచి 2013 వరకు ఆయన సర్పంచ్‌గా ఉండగా 2019లో ఆయన భార్య కూడా సర్పంచ్‌గా గెలుపొందింది. ప్రస్తుతం ఆయన ఆ గ్రామంలో వార్డు సభ్యునిగా పోటీ చేస్తుండటంపై సర్వత్రా ఆసక్తి ఏర్పడింది. వార్డు సభ్యునిగా పోటీ చేయడానికి ఉప సర్పంచ్ పదవి కోసమేనని తెలుస్తుంది. ఆయనకు ప్రత్యర్థిగా మాజీ ఉప సర్పంచ్ బరిలో ఉన్నారు.

మూడో విడతలో ఏకగ్రీవాల జోరు

- నారాయణ ఖేడ్ డివిజన్‌లో ఏకంగా 24 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం

నారాయణఖేడ్/నాగల్‌గిద్ద/సిర్గాపూర్/కల్హేర్/కంగ్టి/కోహెడ/వెల్దుర్తి/మాసాయిపేట/హుస్నాబాద్ రూరల్ /కౌడిపల్లి /చిలప్‌చెడ్ / శివ్వంపేట /అక్కన్నపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ డివిజన్ పరిధిలోని మొత్తం 196 గ్రామ పంచాయతీలలో, నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ మంగళవారం ముగిసింది. పలువురు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకోవడంతో డివిజన్‌లో 24 గ్రామ పంచాయతీలలో సర్పంచ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలాలవారీగా పరిశీలిస్తే నారాయణఖేడ్‌లో 7, సిర్గాపూర్‌లో 7, నాగల్‌గిద్దలో 4, నిజాంపేటలో 3, కంగ్టిలో 2, కల్హేర్‌లో ఒకటి పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. కోహెడ మండలంలోని 27 గ్రామ పంచాయతీలకు గాను, రెండు గ్రామాలలో ఇద్దరు సర్పంచ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వెల్దుర్తి మండలంలో ఉన్న 23 గ్రామ పంచాయతీలలో నాలుగు ఏకగ్రీమయ్యాయిమిగిలిన 19 పంచాయతీలలో సర్పంచ్ పదవికి 70 మంది అభ్యర్థులు, 200 వార్డులలో 38 వార్డులు ఏకగ్రీవం కాగా, మిగిలిన వాటికి 400 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు.మాసాయిపేట మండలంలోని 13 గ్రామ పంచాయతీలకు గాను ఒక సర్పంచ్, 24 వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హుస్నాబాద్ మండలంలో మూడు గ్రామ పంచాయతీలలో సర్పంచ్ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కౌడిపల్లి మండలంలో మొత్తం 35 గ్రామ పంచాయతీలకు గాను ఏడు గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. చిలప్‌చెడ్‌లో మండలం పరిధిలోని రాందాసుగూడా, రహీంగూడా గ్రామాలు ఏకగ్రీవమైనట్లు ఎంపీడీవో ప్రవీణ్ పేర్కొన్నారు. శివ్వంపేట మండలంలోని 37 గ్రామ పంచాయతీలకు గాను మూడు గ్రామ పంచాయతీల సర్పంచులు, వార్డు సభ్యులు ఏకగ్రీవమయ్యారు. అక్కన్నపేట మండలంలో 38 గ్రామపంచాయతీలకు గాను ఆరు గ్రామపంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి.

ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్‌లు మండలాలవారీగా..

నారాయణఖేడ్
- అల్లాపూర్ - కమలానాయక్
- శేరితండా - హీరామన్
- పీర్ల తండా - సాలిబాయి
- డీఎన్‌టీ తండా - కర్ర కమిలిబాయి
- గుండుతండా - మేఘావత్ మౌనిక
- పలుగుతండా - కిషన్‌నాయక్
- కిషన్ నాయక్ తండా - సునీత చౌహాన్

● నాగల్‌గిద్ద
- కేశ్వార్ - ముంగే మహాదేవి
- గంగారాంతండా - రాథోడ్ రేణుక
- కొండానాయక్ తండా - అశోక్ చౌహాన్
- రత్ననాయక్ తండా - జైపాల్‌రాథోడ్

● కల్హేర్
- జమ్లాతండా - గోవింద్‌నాయక్

● కంగ్టి
- చందర్‌తండా - శాంతాబాయి
- జీర్గి తండా - రాథోడ్ యమునాబాయి

● నిజాంపేట
- బల్యాంచెల్క తండా - మూడ్ సరిత
- నాగన్‌కుంట తండా - దేవసోత సాలిబాయి
- మాణిక్ తండా - మంజుల చౌహాన్

● సిర్గాపూర్
- లక్ష్మణ్‌నాయక్ తండా - దూరిబాయి
- పత్రెనాయక్ తండా - మంగ్లీబాయి
- కిషన్ నాయక్ తండా - శిరీషరాథోడ్
- వంగ్దల్ గైర్హాన్‌తండా - మోహన్
- చందర్‌నాయక్ తండా - రుక్మిణీబాయి
- వాసర్ తండా - మంజుల
- సిర్గాపూర్ గైర్హాన్ తండా - వినోద్

● కోహెడ
- విజయనగర్ కాలనీ - అమూల్య రాజశేఖర్ రెడ్డి
- నకిరేకొమ్ముల-బుర్ర కళ్యాణి మహేష్

● వెల్దుర్తి
- శంశీరెడ్డిపల్లి - బానోత్ గణేష్
- చర్లపల్లి - అంబడి అరుణ
- మంగళపర్తి - బాలయ్యగారి సంధ్య
- బస్వాపూర్ - నజ్మా సుల్తానా

● మాసాయిపేట
- నాగసాన్నిపల్లి - మంతూరి ఆంజనేయులు

● హుస్నాబాద్
- రాములపల్లి - కాటం స్వప్న
- వంగరామయ్యపల్లి - భూక్య రాజేశ్వరి
- తోటపల్లి - బంక లక్ష్మి

● కౌడిపల్లి
- శేరితండా -గణేష్
- హరిచంద్రతండా - రవీందర్ నాయక్
- కుష్నగడ్డ తండా - రాజు నాయక్
- మర్రిచెట్టుతండా - రమేష్ నాయక్
- పీరియతండా - రవళిక రమేష్ నాయక్
- దర్మా సార్ గేట్ తండా - సంధ్య
- కన్నారం - కోడూరి రాములు

● శివ్వంపేట
- తాళ్లపల్లితండా- ధనావత్ లక్ష్మీగేమ్‌సింగ్ నాయక్
- మల్లుపల్లి తండా - కేతావత్ నరేష్
- టిక్యాదేవమ్మగూడెం - తేజస్వినిరాజేందర్‌నాయక్

● అక్కన్నపేట
- కెప్టెన్‌చౌడుతండా - గుగులోతు స్వరూప
- గొల్లపల్లి - గుడాల లావణ్య
- శ్రీరామ్‌తండా - బానోతు వెంకటేష్
- కుందనవానిపల్లి -పొన్నాల వెంకవ్వ
- దానుతండా - గుగులోతు పుమీ
- దుబ్బతండా - గుగులోతు శీల

కండువా మార్చి.. ఏకగ్రీవంగా ఎన్నికై..



హుస్నాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ మండలంలోని ఓ గ్రామ పంచాయతీలో సర్పంచ్ అభ్యర్థి కండువా (పార్టీ) మార్చి ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. ఆ గ్రామం బీసీ మహిళలకు రిజర్వేషన్ అయ్యింది. బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు తన భార్యతో నామినేషన్ వేయించారు. మరో ముగ్గురు కాంగ్రెస్ పార్టీకి చెందిన మహిళలు, ఒక బీజేపీకి చెందిన మహిళ కూడా నామినేషన్లు వేశారు. తన భార్యను ఏకగ్రీవం చేస్తే నేను కాంగ్రెస్ పార్టీలోకి వస్తాను అని బీఆర్ఎస్ నాయకుడు చెప్పడంతో, ముగ్గురు కాంగ్రెస్ అభ్యర్థులతో పాటు బీజేపీ అభ్యర్థి తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో సదరు నాయకుని భార్య ఏకగ్రీవం కాగా, వెంటనే ఆయన కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు.

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

● విద్యార్థులకు డీఈవో వెంకటేశ్వర్లు సూచన



విద్యార్థులతో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

మునిపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : త్వరలో జరుగనున్న పది పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి జిల్లాలోనే ఉన్నత స్థానాలను అధిరోహించాలని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రమైన మునిపల్లితోపాటు పెద్దగోపులారం తదితర పాఠశాలలను డీఈవో ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలల తరగతి గదులు, గణిత తచర్చిధ ప్రక్రియ, ఎఫ్ఎల్ఎన్ తరగతి గ్రంథాలయం, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి కార్మికులతో సమస్యలను అడిగి తెలుసుకుని మాట్లాడారు. ప్రైవేట్‌కు దీటుగా సర్కారు బడుల్లో చదువుతున్న విద్యార్థులు తమ సత్తా ఏంటో చూపించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. అంతకు ముందు ఐఎఫ్‌పీ ప్యానల్ ఉపయోగించడంపై విద్యార్థులను అభినందించారు. ఆయన వెంట కాంప్లెక్స్ హెచ్‌ఎం తుకారం, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు నాగేశ్వర్, వీరన్న బాస్కర్, నాగేశ్వర్, కృష్ణవేణి, ప్రశాంత్ కుమార్, రాజు, సీఆర్‌పీ మాణయ్య తదితరులు ఉన్నారు.

నిమ్మతోటను పరిశీలించిన శాస్త్రవేత్తలు

పుల్‌కల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని బస్వాపూర్ గ్రామ శివారులో సాగవుతున్న నిమ్మతోటను ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం-రైతు విజ్ఞాన కేంద్రం సంగుపేట శాస్త్రవేత్తలు డాక్టర్ ఎనిర్మల, కె.అరుణ, కె.రాహుల్‌విశ్వకర్మ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు యాజమాన్య పద్ధతులను వివరించారు. నిమ్మతోటలో అక్కడక్కడ ఏర్పడిన ఆకుముడత తెగుళ్లను గమనించారు. నివారణకు వేపగింజల ద్రావణం 5 మిల్లీమీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. నిమ్మతోటను ప్రధానంగా ఆశించే గజ్జి తెగులు నివారణకు కాపర్ ఆక్సి క్లోరైడ్ 3 గ్రాములు, స్ట్రెప్టోసైక్లిన్ 0.2 గ్రాము లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. పక్కనే ఉన్న జామ తోటను పరిశీలించి, పోషక నివారణ లోపాన్ని సవరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మామిడితోటలో సమయానుకూలంగా కొమ్మ కత్తిరింపులు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు హనుమంతు, రాములు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీ

నారాయణఖేడ్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఖేడ్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని శివానగర్, తిమ్మాపూర్ అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం సంగారెడ్డి జిల్లా శిశుసంక్షేమాధికారి లలితకుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోషకాహారం అందిస్తున్న తీరు, వివిధ సేవల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. తిమ్మాపూర్‌లో చిన్నారులతో కలిసి ప్రీ క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. అనంతరం ఖేడ్ బాల సదనాన్ని సందర్శించి, పరిస్థితులను సమీక్షించారు. ఆమె వెంట సీడీపీవో సుజాత, అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షకులు జమున, ప్రమీల, బలదేవిడ్ ఉన్నారు.

ప్రభుత్వ భూమిలో అక్రమణల కూల్చివేత

జిన్నారం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జిన్నారం మండలం కాజీపల్లిలోని 181 సర్వే నంబరు ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను ఆర్ఐ జయప్రకాశ్‌నారాయణ, రెవెన్యూ సిబ్బంది ఎక్స్‌కవేటర్లతో కూల్చేయించారు. రూ.60 కోట్ల విలువైన ప్రభుత్వ స్థలంలో జరుగుతున్న కబ్జాలపై స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో తహసీల్దార్ ఆదేశంతో కూల్చివేతలు చేపట్టామని ఆర్ఐ తెలిపారు.

విజ్ఞాన బాండాగారాలు గ్రంథాలయాలు

రామచంద్రాపురం టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : విజ్ఞాన బాండాగారాలు గ్రంథాలయాలు అని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం రామచంద్రాపురం జిల్లా పరిషత్ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని కార్పొరేటర్ పుష్పానగేష్‌తో కలిసి ప్రారంభించి మాట్లాడారు. తరగతిలో ఉపాధ్యాయులు చెప్పే పాఠ్యాంశాలకు గ్రంథాలయంలో అర్థాలు లభ్యమవుతాయని తెలిపారు. అన్నిరకాల పుస్తకాలు అందుబాటులో ఉంచేటట్టు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అంజయ్యయాదవ్, పరమేష్‌యాదవ్, ఐలేష్ కుమార్‌గౌడ్, ప్రమోద్‌గౌడ్, ఎంఈఓ రాథోడ్ పాల్గొన్నారు.

హోరాహోరీగా కుస్తీ పోటీలు

కోహీర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కోహీర్‌లోని హజ్రత్ సయ్యద్ మౌలానా మోహీజోద్దీన్ ఉర్సులో భాగంగా మంగళవారం మౌలానా మోహీజోద్దీన్ దర్గా వద్ద నిర్వహించిన కుస్తీపోటీలు హోరాహోరీగా జరిగాయి. ఈ పోటీలకు కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణలోని వివిధ ప్రాంతాలకు చెందిన మల్లయోధులతో పాటు హైదరాబాద్‌కు చెందినవారు పాల్గొన్నారు. గెలుపొందిన మల్లయోధులకు ఉర్సు కమిటీ సభ్యులు నగదుతో పాటు ట్రోఫీలను అందజేశారు.

12న ఎం ఫార్మసీలో స్పాట్ అడ్మిషన్లు

పుల్‌కల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సుల్తాన్‌పూర్ జేఎన్టీయూహెచ్‌లో ఎం ఫార్మసీ కోర్సుకు సంబంధించి స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్టు ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సునీతారెడ్డి తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి ఎంఫార్మసీ కోర్సుల్లో మిగిలిపోయిన ఖాళీలను భర్తీ చేయడానికి ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు 12న ఉదయం 11 గంటలకు ఒరిజినల్ విద్యార్హత పత్రాలు, నిర్దేశించిన ఫీజుతో స్పాట్ కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని ఆమె సూచించారు. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామన్నారు. పూర్తి వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.జేఎన్టీయూహెచ్.ఏసీ.ఇన్‌ను సంప్రదించాలని సూచించారు.

పరిశ్రమలో స్వల్ప అగ్నిప్రమాదం

జిన్నారం, డిసెంబర్, 9 (ఆంధ్రజ్యోతి): జిన్నారం మండలం గడ్డపోతారం పారిశ్రామికవాడలోని లూసెంటు పరిశ్రమలో స్వల్ప అగ్నిప్రమాదం సంభవించింది. వెంటనే అప్రమత్తమైన పరిశ్రమ ఫైర్ ఫైటింగ్ సిస్టంతో మంటలను ఆర్పి వేశారు. ఈ ఘటనలో ఎలాంటి నష్టం సంభవించలేదని పరిశ్రమ వర్గాలు తెలిపాయి.

ప్రభుత్వ పాఠశాలలో విజ్ఞాన్ మేళా

జిన్నారం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జిన్నారం మండలం గడ్డపోతారం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల విజ్ఞాన్ మేళా నిర్వహించారు. మంగళవారం పాఠశాలలో ఏఈటీ పరిశ్రమ సౌజన్యంతో ప్రాథమిక పాఠశాల విద్యార్థులు విజ్ఞాన్ మేళాలో తమ ప్రతిభ చాటుకున్నారు.







ఉత్తమ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దుతా..

● కొత్తపల్లి సర్పంచ్ అభ్యర్థి బైండ్ల అంజలిసత్యనారాయణ

పాపన్నపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : తాను, తన భర్త రెండుసార్లు ఉపసర్పంచ్‌గా కొత్తపల్లి గ్రామానికి ఎంతో సేవలు చేశామని, మరోసారి తనకు అవకాశమిచ్చి సర్పంచ్‌గా గెలిపించాల్సిందిగా పోటీలో ఉన్న బీజేపీ, కాంగ్రెస్ మద్దతుతో ఉమ్మడి సర్పంచ్ అభ్యర్థి బైండ్ల అంజలిసత్యనారాయణ ఓటర్లను కోరారు. నామినేషన్ దాఖలు చేసినప్పటి నుంచి అన్నివర్గాల ప్రజలతో మమేకమై ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. గతంలో ఉపసర్పంచ్‌గా ఉన్నప్పుడు గ్రామాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేశామని, తాము చేసిన సేవలకు ఉత్తమ గ్రామపంచాయతీగా ప్రభుత్వం గుర్తించిన విషయాన్ని వివరించారు. గత కలెక్టర్ ధర్మారెడ్డి చేతులమీదుగా ఉత్తమ గ్రామపంచాయతీ అవార్డును అందుకున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం తనను సర్పంచ్‌గా గెలిపిస్తే ఐదేళ్లలో గ్రామాన్ని అన్నిరంగాల్లో తీర్చిదిద్ది మరోమారు ఉత్తమ గ్రామపంచాయతీ దిశగా రూపుదిద్దుతానని తెలిపారు. ఈ సందర్భంగా అభ్యర్థి భర్త బైండ్ల సత్యనారాయణ మాట్లాడుతూ బీజేపీ కిసాన్‌సెల్ అధ్యక్షుడిగా తాను గ్రామానికి సేవలు చేశానన్నారు. పాపన్నపేట మండలం కొత్తపల్లి గ్రామ కాంగ్రెస్, బీజేపీ మద్దతుతో పోటీలో నిలిచినట్లు తెలిపారు. ఈసారి ఉంగరం గుర్తుకు ఓటేసి తన భార్య బైండ్ల అంజలిని గెలిపిస్తే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. కొత్త పెన్షన్లు, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు నిజమైన లబ్ధిదారులకు అందించేందుకు తోడ్పాటుగా నిలుస్తానన్నారు. మాజీ ఎమ్మెల్యే హనుమంతరావు, ఎమ్మెల్యే రోహిత్‌రావు ఆదేశాల మేరకు సర్పంచ్‌గా పోటీలో ఉంటున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ మద్దతుతో పోటీగా నిలబడ్డ మాజీ జడ్పీటీసీ లింగన్నగారి మల్లప్ప తన కోరిక మేరకు విత్‌డ్రా చేసుకొని తన అభ్యర్థిత్వాన్ని బలపరుస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.



అభివృద్ధిని చూసి గెలిపించండి

● కొత్తపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి కుమ్మరి పద్మజగన్

పాపన్నపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : తన భర్త కొత్తపల్లి గ్రామపంచాయతీకి సర్పంచ్‌గా చేసిన సేవలను గుర్తించి తనకు ఈ ఎన్నికల్లో ఓటేసి గెలిపిస్తే మరోమారు ఉత్తమ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దుతానని పాపన్నపేట మండలం కొత్తపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి కుమ్మరి పద్మజగన్ తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికి తిరుగుతూ ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. తన భర్త గతంలో గ్రామానికి ఎన్నో సేవలు చేశారని, అంతేగాకుండా ప్రతి అంశంలో, అభివృద్ధి విషయంలో ప్రజలతో మమేకమై పనిచేసిన విషయాన్ని ప్రజలతో పంచుకున్నారు. తనను బీఆర్ఎస్ మద్దతుతో పోటీ చేస్తున్న అభ్యర్థిగా కత్తెర గుర్తుకు ఓటేసి గెలిపిస్తే తాను కూడా ప్రజల అభీష్టం మేరకు పనిచేస్తానని హామీ ఇస్తున్నారు. గ్రామంలో మిగిలిపోయిన అభివృద్ధి పనులన్నీ తాను పూర్తిచేయిస్తానని పేర్కొన్నారు. అనంత పద్మనాభస్వామి ఆలయం వద్ద కల్యాణ మండపం నిర్మించి ఇస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి సహకారంతో గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తానని తెలిపారు. అభ్యర్థి భర్త జగన్ మాట్లాడుతూ తాను సర్పంచ్‌గా ఉన్నప్పుడు గ్రామాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేశానన్నారు. చేశానని గుర్తుచేశారు. తన సేవలకు మెచ్చిన ప్రభుత్వం, అప్పటి కలెక్టర్ ధర్మారెడ్డి ఉత్తమ గ్రామపంచాయతీతో పాటు ఉత్తమ సర్పంచ్‌గా అవార్డు అందుకున్న విషయాన్ని గుర్తు చేశారు. కత్తెర గుర్తుకు ఓటేసి తన భార్యను గెలిపించాలని గ్రామ ప్రజలను అభ్యర్థించారు.









అబ్లాపూర్‌ను అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తా..







● కాంగ్రెస్ అభ్యర్థి నీరుడి వెంకటేశం

పాపన్నపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : తొలిసారిగా కాంగ్రెస్ తరఫున అబ్లాపూర్ గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా తాను పోటీలో నిలుస్తున్నట్లు నీరుడి వెంకటేశం తెలిపారు. ఈ ఎన్నికల్లో అవకాశమిచ్చి ప్రజలు గెలిపించాలని ఇంటింటికి తిరుగుతూ అభ్యర్థిస్తున్నారు. గ్రామంలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటానని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ సహకారంతో గ్రామాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి వైపు తీసుకెళ్తానని ప్రజలతో పేర్కొంటున్నారు. గతంలో పాలించిన వారు ప్రజలను, నిజమైన లబ్ధిదారులను పక్కనబెట్టి స్వార్థపూరితంగా అభివృద్ధి పథకాలను కేటాయించారని ఆరోపించారు. కానీ తనను ఈ ఎన్నికల్లో గెలిపిస్తే ఎమ్మెల్యే రోహిత్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్లు, నూతన పెన్షన్లు, రేషన్‌కార్డులు అందించి తోడ్పాటుగా ఉంటానని పేర్కొన్నారు. గ్రామంలో ఉన్న ప్రధాన నీటి సమస్యను పూర్తిస్థాయిలో తీర్చేందుకు కృషి చేస్తానని హామీఇస్తున్నారు. సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణంలో నిధులు సమీకరించి అభివృద్ధి పనులు వేగంగా జరిగేందుకు కృషి చేస్తానని తెలిపారు. విద్యాభివృద్ధికి తనవంతు పెద్దపీట వేస్తానన్నారు. తనను పాపన్నపేట మండలం అబ్లాపూర్ సర్పంచ్‌గా గెలిపిస్తే ఆదర్శ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దుతానన్నారు. గ్రామంలో అన్ని వర్గాలను సమానంగా చూస్తూ అందరి అభీష్టం మేరకు అభివృద్ధికి బాటలు వేస్తానని స్పష్టం చేశారు. మీ ఓటుతో ఆదరించి గ్రామాన్ని అభివృద్ధి చేసే అవకాశం తనకిచ్చి మెజార్టీతో గెలిపించాలని కోరారు.



చలో ఢిల్లీకి వెళ్లిన బీసీ జేఏసీ నాయకులు

సంగారెడ్డి రూరల్ డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య చలో ఢిల్లీ పిలుపు మేరకు సంగారెడ్డి నుంచి బీసీ జేఏసీ నాయకులు మంగళవారం తరలివెళ్లారు. ఇందులో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు, జేఏసీ చైర్మన్ ప్రభుగౌడ్, వెంకటేశ్, మహిళా విభాగం రాష్ట్ర కమిటీ అధ్యక్షురాలు పద్మ, ఐక్య వేదిక కమిటీ అధ్యక్షుడు అనంతయ్య, రాష్ట్ర ప్రధాన ప్రధాన కార్యదర్శి కృష్ణ, సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్‌పాటిల్, జిల్లా కార్యదర్శి సుధాకర్ గౌడ్ తదితరులు ఉన్నారు.



సంగారెడ్డి నుంచి ఢిల్లీకి వెళ్తున్న బీసీ జేఏసీ నేతలు

పూడూరు యాదగిరియాదవ్‌కు అవకాశం ఇవ్వండి



కానుకుంట గ్రామంలో నిర్వహించిన ఎన్నికల ప్రచార ర్యాలీలో ప్రసంగిస్తున్న చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, సర్పంచ్ అభ్యర్థి యాదగిరియాదవ్

గుమ్మడిదల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కానుకుంట విద్యావంతుడు, బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి పూడూరు యాదగిరియాదవ్‌కు అవకాశం ఇవ్వాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం గుమ్మడిదల మండలంలోని వివిధ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం కానుకుంట గ్రామంలో నిర్వహించిన ఎన్నికల ప్రచార ర్యాలీకి అపూర్వ స్పందన లభించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ కానుకుంట గ్రామ అభివృద్ధి, పారదర్శక పాలన, జనసేవే తమ లక్ష్యమన్నారు. బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి పూడూరి యాదగిరియాదవ్ కేవలం పార్టీ అభ్యర్థి మాత్రమే కాకుండా గ్రామ భవిష్యత్‌కు అవసరమైన విద్యావంతుడు, నిబద్ధత గల సేవకుడు అని అన్నారు. కొన్ని పార్టీలు ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రమే ప్రజల ముందుకు వచ్చి మోసపూరిత హామీలు ఇస్తున్నాయని, గెలిచాక పట్టించుకునే పరిస్థితి లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు వెంకటేష్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ కుమార్‌గౌడ్, విజయభాస్కర్‌రెడ్డి, నక్క వెంకటేష్ గౌడ్, సర్వర్, విశాల్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, రాజేష్, హుస్సేన్, ముద్రికచారి, భార్గవ్‌చారి, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ష్.. గప్‌చుప్

(5వ పేజీ తరువాయి)

మండలాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఇక ఓటుకు రూ.1000 నుంచి రూ.10వేల దాకా పలుకుతున్నట్లు తెలుస్తోంది. రియల్ ఎస్టేట్, వాణిజ్యపరంగా ఈ గ్రామాలు అభివృద్ధి చెందుతుండడంతో మళ్లీ సంపాదించుకోవచ్చనే ఉద్దేశంతో ఇష్టారాజ్యంగా నగదు, మద్యం పంపిణీ చేస్తున్నారు. గడిచిన వారం రోజులుగా మటన్, చికెన్, కూల్‌డ్రింకులు, బిర్యానీ ప్యాకెట్లను సైతం ఈ గ్రామాల్లో అందజేసినట్లు చర్చ జరుగుతోంది.

చీరలు.. వెండి.. మాంసం

ఎన్నికలకు ఒక్కరోజు మాత్రమే సమయం ఉండడంతో పంపకాలు ప్రారంభించారు. సర్పంచ్, వార్డు సభ్యుల రేసులో ఉన్నవారు మహిళలకు చీరలు అందజేస్తున్నారు. వెండితో తయారు చేసిన చిన్నపాటి కుంకుమ భరిణిలు, లక్ష్మీ అమ్మవారి ప్రతిమలను సెంటిమెంట్‌గా ఓటర్లకు అందజేసి ప్రమాణం తీసుకుంటున్నారు. ఇక కిలో చొప్పున మటన్, చికెన్ మాంసంతోపాటు మద్యం, కూల్‌డ్రింక్‌లను చేరవేస్తున్నారు. పోటీ తీవ్రంగా ఉన్న గ్రామాల్లో దేవుడి బొమ్మపై నోటు పెట్టి అందిస్తున్నారు. తమకే ఓటు వేయాలని మరీమరీ ఒట్టు వేయించుకుంటున్న పరిస్థితి ప్రస్తుతం గ్రామాల్లో నెలకొంది.

వృద్ధులు నిరాదరణకు గురవడం విచారకరం

● ఎమ్మెల్యే సునీతారెడ్డి



సీనియర్ సిటిజన్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మదన్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, వాసుదేవరావు తదితరులు

నర్సాపూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మారుతున్న కాలానుగుణంగా ఉమ్మడి కుటుంబాలు లేకుండాపోతున్నాయని, తద్వారా వృద్ధులు నిరాదరణకు గురవుతుండడం విచారకరమని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వృద్ధుల దినోత్సవం సందర్భంగా లయన్స్‌క్లబ్ ఆఫ్ నర్సాపూర్ స్నేహబంధు ఆధ్వర్యంలో లయన్స్ భవనంలో 70 ఏళ్లు దాటిన సీనియర్ సిటిజన్లను సన్మానించారు. క్లబ్ అధ్యక్షుడు రామచేందర్‌రావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే సునీతారెడ్డితో పాటు మాజీ ఎమ్మెల్యేలు మదన్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, వాసుదేవరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా సునీతారెడ్డి మాట్లాడుతూ నేటి తరం ఉమ్మడి కుటుంబం విలువలు, వాటి ద్వారా వచ్చే ఆత్మీయత అనురాగాలకు దూరమవ్వడమే కాకుండా పెద్దల పట్ల గౌరవం లేకుండా పోతుందన్నారు. ఈ కార్యక్రమంలో జోన్ చైర్మన్ బుచ్చేస్‌యాదవ్, కార్యదర్శి అశోక్, కోశాధికారి వెంకటస్వామి, క్లబ్ గవర్నర్ అమరనాథ్, ప్రతినిధులు రామకృష్ణారెడ్డి, ఓబులేరెడ్డి, నర్సింహారెడ్డి, జైపాల్, సుధాకర్ పాల్గొన్నారు.

ఎన్నికల్లో సమర్థవంతంగా పనిచేయాలి



ప్రిసైడింగ్ అధికారుల శిక్షణలో ప్రసంగిస్తున్న ఆర్డీవో

తూప్రాన్/వెల్దుర్తి/చేగుంట/చిన్నశంకరంపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు పోలింగ్ బృందం అత్యంత జాగ్రత్తతో పనిచేయాలని డిప్యూటీ డిస్ట్రిక్ట్ ఎన్నికల అధికారి, తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి సూచించారు. మంగళవారం తూప్రాన్ మున్సిపల్ కార్యాలయంలో ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం చేపట్టారు. అలాగే వెల్దుర్తి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న నామినేషన్ల ఉపసంహరణను ఆర్డీవో జయచంద్రారెడ్డి పరిశీలించారు. చేగుంట మండలం వడియారం గ్రామంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో పీవోలకు ఎంపీడీవో చిన్నారెడ్డి ఎన్నికలపై అవగాహన కల్పించారు. చిన్నశంకరంపేటలో తహసీల్దార్ ప్రభుదాస్ ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇచ్చారు.

అభివృద్ధి పథంలో పాపన్నపేటను తీసుకెళ్తాం

● కాంగ్రెస్ అభ్యర్థి ఆకుల మంజులశ్రీనివాస్



పాపన్నపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : గతంలో తన భర్త ఎంపీటీసీగా చేసిన సేవలను గుర్తించి ఈసారి తనకు పాపన్నపేట సర్పంచ్‌గా అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ అభ్యర్థి ఆకుల మంజులశ్రీనివాస్ కోరారు. తనకు కేటాయించిన ఉంగరం గుర్తుపై ఓటేసి అధిక మెజార్టీతో గెలిపించాలంటూ ఇంటింటి ప్రచారం చేశారు. మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు సహకారంతో అభివృద్ధి వైపు గ్రామాన్ని తీసుకెళ్తానని చెప్పారు. గతంలో నిలిచిన అభివృద్ధి పనులను పూర్తి చేసేందుకు శాయశక్తులా కృషి చేస్తానన్నారు. అనంతరం ఓటర్లతో ఆకుల శ్రీను మాట్లాడుతూ గతంలో తనను ఎంపీటీసీగా, ఉపసర్పంచ్‌గా ఆదరించి ఎన్నుకున్న పాపన్నపేట ప్రజలు, ఈసారి తన భార్య మంజులను కూడా అదేవిధంగా ఆదరించి సర్పంచ్‌గా గెలిపించాలని అభ్యర్థించారు.



ఆదరించి గెలిపిస్తే.. అభివృద్ధి చేసి చూపిస్తా

● ఆరేపల్లి కాంగ్రెస్ అభ్యర్థి మేఘజోళ్ల రజితారాజశేఖర్





పాపన్నపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఈ ఎన్నికల్లో తనను ఆదరించి సర్పంచ్‌గా గెలిపిస్తే ఆరేపల్లి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని సర్పంచ్ అభ్యర్థి మేఘజోళ్ల రజితారాజశేఖర్ పేర్కొన్నారు. మండల పరిధిలోని ఆరేపల్లిలో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థిగా, భర్త రాజశేఖర్‌తో కలిసి కత్తెర గుర్తుకు ఓటు వేయాలని ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. మద్దతుదారులు సైతం రజిత పక్షాన ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. తనను గెలిపిస్తే యూసుఫ్‌పేట నుంచి ఆరేపల్లి గ్రామానికి వచ్చే రోడ్డు విస్తరణ పనులు చేయిస్తానని హామీఇస్తున్నారు. అభ్యర్థి భర్త, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాజశేఖర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే సహకారంతో ఆదర్శ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు.